భారతిస్వామి ఆశీర్వాదం తీసుకున్న కిషన్‌రెడ్డి

రాంనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం నగరంలోని నల్లకుంట శంకరమఠంలో జగద్గురు శంకరాచార్య విధుశేఖర భారతిస్వామిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శంకర మఠంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.


విధుశేఖర భారతిస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్ మద్యంషాపులకు 851 దరఖాస్తులు

- ఎక్సైజ్ శాఖకు రూ.25.53 కోట్ల ఆదాయం
- నేడు లక్కీడ్రా : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

ముషీరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 29వైన్ షాపులకు టెండర్ దరఖాస్తుల ప్రక్రియ తెరిసింది. మద్యంషాపులను దక్కించుకోనేందుకు గడువు ముగిసే సమయానికి 29 వైన్‌షాపులకు గాను 851 దరఖాస్తులు వచ్చాయని ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్‌శాఖకు రూ.25కోట్ల 53లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో గల బీజేఆర్ భవనంలో జిల్లా కలెక్టర్ హరిచందన, ఎక్సైజ్ ఉన్నతాధికారుల సమక్షంలో దరఖాస్తుల లక్కీ డ్రా తీయనున్నట్లు సీఐ తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

కార్తీకమాస పూజలు

ముషీరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : బాలాపూర్ దేవుని తోటలోని భవానిశంకర ఆలయంలో నవంబర్ 20వ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారి పారాయణాలు, అర్చనలు, అభిషేకాలు, స్వామివారి కల్యాణం, చండీహోమం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, సిబ్బంది సురేష్‌కుమార్, సాగర్, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న ఛైర్మన్ మేడి సురేష్‌కుమార్, భక్తులు

ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు

ముషీరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.ఎన్.చారి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఛత్రపతి శివాజీ ఆశయాలకు అనుగుణంగా యువత పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బాపూజీనగర్ బస్తీ పెద్దలు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జి.ఎన్. చారి తదితరులు

వైహెచ్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేష్‌కుమార్‌యాదవ్

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : యాదవ హక్కుల పోరాట సమితి (వైహెచ్‌పీఎస్) ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాంనగర్ డివిజన్‌లోని బాకారంకు చెందిన మార్క రమేష్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు యాదవ హక్కుల పోరాట సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గంగాబోయిన రవికుమార్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల కిరణ్‌యాదవ్‌లు ఆయన నియామకం ప్రకటించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ హక్కుల సాధన కోసం పోరాడుతానన్నారు. సంఘం తనకు ఇచ్చిన ఈ పదవికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. నియోజకవర్గంలోని యాదవుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. ఈ పదవి కల్పించినందుకు సంఘం నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


రమేష్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న రవికుమార్‌యాదవ్


తెలంగాణ పత్తి రైతుల సంఘం నూతన కమిటీ సభ్యులు

తెలంగాణ పత్తి రైతుల సంఘం కమిటీ ఎన్నిక

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పత్తి రైతుల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కన్వీనర్‌గా భూక్య చందునాయక్, కో-కన్వీనర్లుగా మూడ్ శోభన్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, చెల్మురి రాము, బి.వెంకట్‌రెడ్డి, జి.రాజన్న, చిలుక బాల్‌రెడ్డి, వానిరెడ్డి వరప్రసాద్, ఎస్.కె.సైదా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా చల్లా నర్సింహారెడ్డి, చింతల రజనీకాంత్, జి.వాసుదేవ్, వాకుడోత్ కోబాల్, ఎం. సాంబశివరావు, మావేటి కోటయ్య, ఎం.కనకాచారి, ఎర్ర నాయక్, వెంకటేశ్వర్ రావు, మంగ వీరయ్య, రాజయ్య నియమితులైనట్లు రాష్ట్ర కన్వీనర్ తెలిపారు.


కరపత్రికను ఆవిష్కరిస్తున్న నేతలు

లీడ్ క్యాప్ భూముల పరిరక్షణ సమితి కమిటీ ఎన్నిక

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ లీడ్ క్యాప్ భూముల పరిరక్షణ సమితి నూతన కమిటీ ఎన్నిక ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మోచీలు, మాదిగ కులస్థులు కలిసి భూముల పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా వీరస్వామి పల్లెలు, వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజమౌళిని ఎన్నుకోవడం జరిగింది. సలహాదారులుగా ఆరేపల్లి రాజేందర్, ప్రొఫెసర్ కాసీం, కోశాధికారిగా ఓయూ ప్రిన్సిపాల్ బెజ్జంకి రాంబాబు, జైన్‌రావు, వైస్‌ఛైర్మన్ చంద్రగిరి సత్యనారాయణ, కన్వీనర్ ములుగు రాజు, కో-కన్వీనర్‌గా రాజారాం, రమేష్, శంకర్, హనుమంతు, భూమయ్య, గుమ్మడి సతీష్, మాణిక్‌రావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి స్కైలాబ్, ప్రొఫెసర్ నతానియేలు, బొజ్జ సైదులు, కిరణ్, డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. ఇటీవల మహబూబ్‌నగర్‌లో రెండురోజుల పాటు జరిగిన యూనియన్ మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గణపతిరెడ్డి, సుధాకర్, వర్కింగ్ అధ్యక్షుడిగా వెంకటయ్య, కోశాధికారిగా మహేష్, మహిళా కన్వీనర్‌గా యాదమ్మతో పాటు మరో 21మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నికయ్యారని అధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు.

గోవుల సంరక్షణ అందరి బాధ్యత

- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : గోవుల పెంపకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గోసేవ విభాగం ఆధ్వర్యంలో భారత గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాల ఆవరణలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆర్ఎస్ఎస్ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాల ఉత్పత్తికి గోవు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని దేశంలో గోవుల సంఖ్యను 65శాతానికి కేంద్రం పెంచిందని, దీంతో పాటు అనేక రాష్ట్రాల్లో గోవులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఆవు పాలు విశ్వానికే తల్లి అని అన్నారు. గోవుల రక్షణ గో పరిరక్షకుల బాధ్యత కాదని మొత్తం సమాజానిదన్నారు. పుట్టిన బిడ్డల నుంచి వ్యక్తి అంతిమ సంస్కారం వరకు గోవుల ప్రాధాన్యం ఉంటుందన్నారు. గోవుల పోషణను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుంటూ గోవుల పరిరక్షణ ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలన్నారు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన తనకు గోవుల పరిరక్షణ, వాటి ఆవశ్యకతపై అవగాహన ఉందన్నారు. గోవుల గొప్పతనం గురించి వేదాలు చెబుతున్నాయన్నారు. గోవులు కేవలం పాలకు మాత్రమే కాకుండా వాటి శ్వాస, ఉస్వాల మధ్య గడిపే సమయం మనిషిలోని సగం ఆరోగ్య సమస్యను పరిష్కరిస్తుందన్నారు. ఈ విషయంపై స్వయంగా ప్రధాని మోదీ వెల్లడించారు. ఎప్పుడు బిజీగా ఉండే ప్రధాని మోదీ తన నివాసంలో గోవులను పరిరక్షిస్తూ కొంత సమయం కేటాయిస్తారని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ గోవుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. పశువుల పోషణను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. పశుపోషణకు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ రుణం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతీయ గోవు పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానంపై రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ గోసేవ విభాగం ప్రతినిధి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 4లక్షల 12వేల మందికిపైగా పాల్గొన్నారని అన్నారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి 50వేలు, తృతీయ బహుమతి 25వేలతో పాటు 10మందికి కన్సోలేషన్ బహుమతి ప్రదానం చేశారు.



బహుమతి అందజేస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

4నుంచి ఓయూలో బీసీ విద్యార్థుల నిరాహారదీక్షలు

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం నవంబర్ 4 నుంచి 8వ వరకు ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ విద్యార్థుల నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లు సాధించుకునేంత వరకు బీసీ విద్యార్థులు ఐక్యపోరాటం చేయాలన్నారు. రాజ్యాంగపరంగా బీసీ విద్యార్థులకు రావాల్సిన ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా లక్షలాది మంది మారిపోతున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. రాజ్యాంగపరంగానే శాశ్వతంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రిజర్వేషన్ల సాధన కోసం ఓయూ బీసీ విద్యార్థులు చేపట్టే నిరాహార దీక్షలో విద్యార్థులు వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఓయూ బీసీ విద్యార్థి వేదిక అధ్యక్షుడు జపాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రంగసాయి బట్టు, అచ్చయ్య, వెంకట్, ఎం.రవికుమార్, కోల శేఖర్, అభిలాష్, కె.రమేష్, ఎన్.మధు, ప్రణయ్‌భాస్కర్, శ్రీధర్‌యాదవ్, సంతోష్, శివ, కార్తీక్, శివకుమార్ పాల్గొన్నారు.


నిరాహారదీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తదితరులు

దళితులకు రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం

- బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ బీ.ఎస్.రాములు

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : యువ రచయితలు, కవులు, కవయిత్రులు సామాజిక న్యాయం కోసం సాహిత్యాన్ని సృష్టించాలని బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ బీ.ఎస్.రాములు పేర్కొన్నారు. తాను దేశమంతా పర్యటించి ప్రత్యామ్నాయ సాహిత్యసృష్టితో ప్రజా ఉద్యమాలు నిర్మించామన్నారు. దళిత, బహుజనులు చైతన్యవంతులై రాజ్యాధికారం చేపట్టిన నాడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్యం, అనువాద ఫౌండేషన్ సౌజన్యంతో విమలా సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన బీ.ఎస్.రాములు రాసిన అఖిలభారత పర్యాటన, మామిడిపల్లి ఇంద్రాణి రాసిన ఇంద్రకమలం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ పుస్తకాలను బైసా దేవదాస్‌తో కలిసి బీ.ఎస్.రాములు ఆవిష్కరించి మాట్లాడారు. ఇంద్రాణి చిన్న వయసులోనే అద్భుత కవిత రాశారని ప్రశంసించారు. సరళమైన భాషలో వస్తు వైవిధ్యంతో సరికొత్త అభివ్యక్తితో కవిత రాశారని అన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ జెల్లి విద్యాధర్, నారగోని, బైసా దేవదాస్, డాక్టర్ అనంత పద్మనాభరావు, మువ్వ శ్రీనివాసరావు, కవయిత్రులు జ్వలత, జాజుల గౌరీ, డాక్టర్ రాధ కుసుమలు పాల్గొని మాట్లాడారు. దళిత, బహుజన యువకులను కవులుగా, కథా రచయితలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇంద్రకమలం కవితా పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ఈసందర్భంగా గ్రంథ రచయితలను సత్కరించారు.


అఖిల భారత పర్యాటన, ఇంద్రకమలం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీ.ఎస్.రాములు, సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ జెల్లి విద్యాధర్, బిక్కి కృష్ణ

మన్‌కీ బాత్‌ను వీక్షించిన కార్పొరేటర్, బీజేపీ నేతలు

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్ లక్ష్యాన్ని చేరేందుకు ప్రధాని మోదీ నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బాగ్‌లింగంపల్లిలోని కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం ప్రధాని మోదీ నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రతి పౌరుడిలో సామాజిక బాధ్యత, దేశ నిర్మాణం, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. యువతలో స్ఫూర్తినింపుతూ సావలంబన మార్గంతో వికసిత భారత్ లక్ష్యాన్ని చేపట్టే చర్యలను ప్రధాని వివరించడం అభినందనీయమన్నారు. ప్రతి పౌరుడు మన్‌కీ బాత్ వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

చిక్కడపల్లి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ భావాలు ప్రతి పౌరుడిలో సామాజిక బాధ్యతను పెంచుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి.గోపాల్ అన్నారు. ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వివేక్‌నగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక ద్వారా బీజేపీ నేతలు, స్థానికులు విన్నారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మోదీ స్ఫూర్తిదాయక ఆలోచనాత్మక మన్‌కీబాత్ వికసిత భారత్ లక్ష్యాన్ని చేరేందుకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోనేటి సత్యం, కిరణ్, లక్ష్మీనారాయణ, సురేష్, శివ, పద్మ, సంజయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.


మన్‌కీ బాత్‌ను వింటున్న బీజేపీ నేతలు

నేడు రక్తదాన శిబిరం

చిక్కడపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సెంట్రల్‌జోన్ పోలీస్ విభాగం పరిధిలోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో రక్తదాన శిబిరం జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, జాయింట్ సీపీ తఫ్‌సీర్ ఇక్బాల్, సెంట్రల్ జోన్ డీసీపీ ప్రవల్లిక, చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ అతిథులుగా పాల్గొంటారని వివరించారు. రక్తదానం చేసి ఒకరి ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



శంకరమఠంలో శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామిని కలిసి ఆశీర్వాదం పొందిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కె.గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు జయశ్రీ, సౌందర్యలహరి, కొండూరి పద్మావతి, ఆధ్యాత్మికవేత్త రఘురామశర్మ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

దివ్యాంగుల పెన్షన్ పెంపునకు దేశవ్యాప్త ఉద్యమం

చిక్కడపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ వాటా పెంపు కోసం దేశవ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్డీ) జాతీయ అధ్యక్షుడు గిరీష్ కీర్తి అన్నారు. ఎన్‌పీఆర్డీ జాతీయ కార్యవర్గ సమావేశాలు చిక్కడపల్లిలోని శ్రీసాయి రెసిడెన్సీలో ఆదివారం జరిగాయి. ఎన్‌పీఆర్డీ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు నంబురాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరీష్‌కీర్తి మాట్లాడుతూ వికలాంగుల హక్కులకు తిలోదకాలిస్తున్న మనువాదాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక అసమానతలు పెంచిపోషిస్తుందని ఆయన మండిపడ్డారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమిస్తామన్నారు. ట్రంప్ విధిస్తున్న సుంకాలు సామాజిక భద్రత, విద్యా, వికలాంగుల హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గించిన కేంద్రం గతంలో వికలాంగులకు ఇచ్చిన జీఎస్టీ రాయితీలను ఎందుకు ఉపసంహరించుకుందని ప్రశ్నించారు. వికలాంగుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగులకు ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి మురళీధరన్, ఉపాధ్యక్షులు అడివయ్య, ఝాన్సీ, రిషికేష్, చక్రవర్తి, వెంకట్, వెంకటేష్, రాజు, రంగప్ప, రాజన్, విల్సన్, భారతి, 15 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మహారుద్రాభిషేకం

బర్కత్‌పుర, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్, ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్‌గుప్తా అధ్యక్షతన 11 మంది వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ 60 కిపైగా జంటలు మహారుద్రాభిషేకంలో పాల్గొని పూజలు నిర్వహించారు. సంఘ సభ్యులు, దాతలు అందించిన సహాయ సహకారాలతో రుద్రాభిషేకం వేడుకలు ఘనంగా జరిగాయి. లోక కల్యాణార్థం జరిగిన ఈ పూజా కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబ్ లక్ష్మణ్, మాజీ అధ్యక్షుడు కొమ్మిరిశెట్టి అనిల్‌కుమార్, కార్యదర్శి గాదే మహేష్, కోశాధికారి కొక్కండ నిఖిలేష్, బెజగం శ్రీధర్, విప్పల్ అనిల్‌కుమార్, గుండా మురళీకృష్ణ, అలంపల్లి రవికుమార్, గుండా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


మహారుద్రాభిషేకంలో ఆర్యవైశ్య సంఘం నేతలు

దేశ ఆర్థికాభివృద్ధిలో విద్యార్థులు కీలకభూమిక పోషించాలి

- ఓయూ ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరామ్

రాంనగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థికాభివృద్ధిలో పట్టభద్రులైన విద్యార్థులు కీలకభూమిక పోషించాలని ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరామ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో రామంతాపూర్‌కు చెందిన అరోరా పీజీ కళాశాలల స్నాతకోత్సవం సమారోహ్ - 2025 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అరోరా విద్య సంస్థలు అందిస్తున్న విద్య సేవలు ఇతర సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. విద్యారంగంలో వస్తున్న నూతన పద్ధతులను తమ కళాశాల విద్యార్థులకు తెలియజేస్తూ వారిని ప్రపంచంతో పోటీపడే విధంగా తయారు చేయడంలో ఎంతో కృషి చేస్తుందన్నారు. పట్టభద్రులైన విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల, తల్లిదండ్రులు, దేశానికి పేరు తెచ్చే విధంగా భవిష్యత్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అడ్మినిస్ట్రేషన్ న్యూఢిల్లీ ప్రొఫెసర్ కుమార సురేష్, ఐఐఎం కోజికోడ్ ప్రొఫెసర్ శ్రీధర్‌గూడ, డిజిటల్ డేటా టెక్నాలజీస్ నోవార్టిస్ ఇండియా డైరెక్టర్ శ్రీతేజ్‌కుమార్, అరోరా విద్య సంస్థల కార్యదర్శి రమేష్‌బాబు, ఛైర్మన్ నిమ్మటూరి అనుదీప్, డైరెక్టర్ ఎం.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ సీ.హెచ్.సతీష్, దేవేందర్‌రావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవం సందర్భంగా ఏడుగురికి బంగారు పతకాలు, 40మందికి ప్రతిభా పట్టాలు, 920 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.




అరోరా పీజీ కళాశాలల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరామ్, ప్రొఫెసర్ కుమార సురేష్



నల్లకుంట మెయిన్ రోడ్డులోని శంకరమఠంలో శృంగేరీశారదా ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, పార్టీ నాయకులు బి.సురేష్‌యాదవ్ తదితరులు - నల్లకుంట, ఆంధ్రజ్యోతి


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఆ నియోజకవర్గంలోని రహమత్‌నగర్ డివిజన్‌లో నల్లకుంట డివిజన్‌కు చెందిన బీజేవైఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్.రాంజగదీష్ ముదిరాజ్ నేతృత్వంలో ఆదివారం బీజేపీ నాయకులు విజయ్, అరవింద్, చింటు, మహేష్, అర్జున్ తదితరులు పార్టీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి విజయం కోసం ఆ ప్రాంతంలో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి


కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగల్‌రావునగర్‌లోని రహమత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డి శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు ఎస్ ప్రసన్న, లక్ష్మీకాంత్, నీల్‌రాజ్, రాఘవేంద్ర, కార్తికేయ, శివరాజ్, జగదీష్ - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి


అంబర్‌పేట డివిజన్‌లోని ఓవైసీనగర్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ కాథలిక్ చర్చి కమిటీ సభ్యులు ఆదివారం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ కాథలిక్ చర్చి నూతన కమిటీ సభ్యులు ఈనెల 28వ తేదీన చర్చి ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే వెంకటేష్ సత్కరించి అభినందించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి


నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ప్రధాని మోదీ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు వాసు, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


ఆజామాబాద్ ట్రాన్స్‌కో పరిధిలోని మోహన్‌నగర్‌లో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాల దృశ్యం - రాంనగర్, ఆంధ్రజ్యోతి

చెట్ల కొమ్మల కింద పడి తీవ్రగాయాలైన రామకృష్ణ మృతి



ముషీరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రామకృష్ణ(60)పై పడడంతో తీవ్రగాయాల పాలైన విషయం విదితమే. గత నెల 19న భోలక్‌పూర్ డివిజన్‌లోని పీ అండ్ టీ కాలనీలో విద్యుత్ తీగలకు తాకుతూ ప్రమాదంగా మారిన చెట్లకొమ్మలను కొట్టివేస్తుండగా అటుగా వెళ్తున్న రామకృష్ణపై ప్రమాదవశాత్తు చెట్లకొమ్మలు పడడంతో తీవ్రగాయాలపాలైనాడు. వెంటనే స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. నెల రోజులుగా ఆస్పత్రిలో వైద్యచికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆయన మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, కాలనీ ప్రధాన కార్యదర్శి లతా తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. రామకృష్ణ అంత్యక్రియలు బన్సీలాల్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించారు.